ప్రజాశక్తి

గురువారం 19 సెప్టెంబర్ 2024 5

పార్వతీపురం మన్యం

గంటేడకు జాషువా కవితా పురస్కారం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా కవితా పురస్కారానికి ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం బుధవారం ప్రకటించింది. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, ప్రజా నాట్య మండలి, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27న గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో గౌరునాయుడుకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు. గుర్రం జాషువా కవితా పురస్కారానికి గంటేడ ఎంపిక పట్ల పార్వతీపురం మన్యం జిల్లాలోని సాహితీవేత్తలు మంచుపల్లి శ్రీరాములు, పల్ల పర్శినాయుడు, జి.రామకృష్ణ, జగదీష్, స్వామినాయుడు, రవీంద్ర, అప్పలనాయుడు, రామలింగస్వామి, భీమేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, గోపాలరావు, రోహిణి కుమార్, సోమేశ్వరరావు, చిన్నమునాయుడు, నాగు కాకిముక్కల హర్షం వ్యక్తంచేశారు. గంటేడకు అభినందనలు తెలియజేశారు.

విజయనగరంలోని ఐఎఎస్ యాప్ కార్యాలయం

జిల్లాలో మరో ఆన్‌లైన్‌మోసం వెలుగు చూసింది. ఉమ్మడి జిల్లాకు చెందిన వేల మంది ఖాతాదారులను మోసగించి కోట్లాది రూపాయలకు ఆ సంస్థ ఎగనామం పెట్టింది. దీంతో వారంతా లబోదిబోమంటున్నారు. గత నాలుగు నెలలుగా కార్యకలాపాలు సాగించిన ఐఎఎస్ (ఇండియా అడ్వర్‌టైజింగ్ సర్వీసు) అనే సంస్థ ఆన్‌లైన్‌లో ఐఎఎస్ యాప్‌లో పెట్టుబడి పెట్టించి కోట్లాది రూపాయలు మోసం చేసిందని ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాసన్నపేట రింగ్‌రోడ్డు వద్ద గల ఈ సంస్థ కార్యాలయానికి తాళాలు వేసి ఉండడంతో ఖాతాదారులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఆన్‌లైన్ వ్యాపారాలు, యాప్‌లను నమ్మి మోసపోవద్దని ఓ వైపు పోలీసులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నా, ప్రతిరోజూ ఇలాంటి మోసాలు జరుగుతున్నా ఈజీగా డబ్బు సంపాదించ వచ్చునన్న అత్యాశతో డబ్బులు పోగొట్టుకుంటున్నారు.

- బోర్డు తిప్పేసిన ఐఎఎస్ యాప్
- ఉమ్మడి జిల్లాలో 30 వేలకు పైగా ఖాతాదారులు
- రూ.కోట్లలో డిపాజిట్లు

మరో ఆన్‌లైన్ మోసం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఐఎస్ సంస్థలో చేరిన ఖాతాదారులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఐఎస్ సంస్థ ఆన్‌లైన్ బేస్‌డ్‌గా కార్యకలాపాలు నిర్వహించింది. పెట్టుబడులను ఆకర్షించడానికి కమీషన్లు ఆశ చూపించి ఏజెంట్లుగా కొంతమందిని ఏర్పాటు చేసుకుంది. ఏజెంట్లుగా వారు చేర్చిన ఖాతాదారులు యాప్‌లో లైక్‌లు కొట్టి, షేర్ చేస్తే నెలకు రూ.15వేలు నుంచి లక్ష రూపాయలు వరకు ఆదాయం వస్తుందని ప్రచారం చేయడంతో ఈజీగా డబ్బు సంపాదించవచ్చునని ఆశపడి జిల్లాలో వేలాది మంది ఈ యాప్‌లో డబ్బులు కట్టి చేరారు. చేర్పించిన వారి సంఖ్యను బట్టి హోదా ఇచ్చి కమీషన్ చెల్లింస్తుండడంతో వారి స్నేహితులు, సన్నిహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు పేరున పెట్టుబడులు పెట్టించారు. రూ.2100, రూ.5500, 18300, రూ.55వేలు ఐఎస్ యాప్ ద్వారా జమ చేయించారు. ఈ యాప్‌లోకి ఎంటర్ అయిన తరువాత ఆయాప్‌లో ఖాతాదారుల నుంచి వసూలు చేసే మొత్తాన్ని జమ చేస్తుండేవారు. ఈ మొత్తం ఒక్కోసారి ఒక్కొక్కరి ఖాతాలో జమవుతుండేది. యాప్‌లో చాటింగ్ తప్ప నేరుగా సమాచారం ఇచ్చేవారు ఉండరని ఏజెంట్లు చెబుతున్నారు.

ఆన్‌లైన్ లింకు ద్వారా జమ

ఖాతాదారుల నుంచి జమ చేయించిన మొత్తాలను స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి వారంలో ఐదు రోజులకు వచ్చే లాభాలను ప్రతి శుక్రవారం ఐఎస్ వాలెట్ ద్వారా ఖాతాదారులకు చెల్లింపులు చేస్తామన నమ్మబలికారు. ఒక వేళ విత్‌డ్రా చేసుకోకపోతే, ఆ మొత్తాన్ని తిరిగి పెట్టుబడిగా పెట్టవచ్చునని, లేదంటే రావాల్సిన మొత్తం వెనక్కి వెళ్లిపోతుందని ప్రచారం చేశారు. ఇందులో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపించే వారికి మొదటి ఒక లింక్ ఫోన్‌కు వస్తుంది. ఈ లింకు క్లిక్ చేస్తే అందులో పేరు, చిరునామా, ఆధార్, బ్యాంకు అకౌంట్ వివరాలు ఇస్తే అందులో ఎంత పెట్టుబడికి ఎంత రిటర్న్ వస్తుందో వివరాలు కనిపిస్తాయి. ప్రతి విత్‌డ్రాకు పదిశాతం సర్వీసు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు చూపించారు. రూ.2100 జమ చేస్తే రోజుకు రూ.75చొప్పున, ఏడాదికి రూ.22500, రూ.18300కు రోజుకు రూ.600 చొప్పున రిటర్న్ ఏడాదికి రూ.1.98లక్షలు రిటర్న్ వస్తాయని ఐఎస్ సంస్థ కమిషన్ ఏజెంట్ల ద్వారా ఖాతాదారులకు ఎరవేసి పెట్టుబడులు పెట్టించింది. ఇలా ఉమ్మడి జిల్లాలో 30వేల మంది ఈ యాప్‌ద్వారా డబ్బులు కట్టినట్లు తెలుస్తోంది. మొదట్లో చేరిన వారంతా ప్రతి వారం వాలెట్ ద్వారా రిటన్స్ రావడంతో వారంతా అత్యాశకు పోయి చిన్న మొత్తాలు జమ చేసిన వారంతా రూ.18300, రూ.55వేలు జమ చేయడం ప్రారంభించారు. కొంతమంది ఒకటి రెండుసార్లు వారికి వచ్చిన కమీషను డబ్బులను తీసుకున్నారు. వీరంతా ప్రచారం చేయడంతో మిగతా జనాలు ఎగబడి కట్టేశారు.

ఎవరూ ఫిర్యాదు చేయలేదు

ఐఎస్ యాప్ ద్వారా డబ్బులు చెల్లించి మోసపోయిన వారెవరూ ఇంతవరకు తమకు ఫిర్యాదు చేయలేదని టూ టౌన్ సిఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఫిర్యాదులొస్తే పరిశీలిస్తామని తెలిపారు.

కార్యాలయం మూతతో ఆందోళన

రెండు రోజులుగా యాప్‌ద్వారా లావాదేవీలు నిలచిపోవడంతో ఒక్కసారిగా ఖాతాదారులంతా ఉలిక్కి పడ్డారు. డబ్బులు జమ చేసిన వారి సంఖ్య అమాంతంగా పెరగడం, తక్కువ మొత్తాలు కట్టిన వారికే రిటర్న్ రావడంతో పెద్ద మొత్తం కట్టేవారిని వారి కొన్నాళ్లు వేచి ఉండాలని యాప్ ద్వారా సమాచారం ఇచ్చారు. అంతేకాకుండా కమీషన్ డబ్బులను డ్రా చేసుకోవాలంటే లక్షకు రూ.30వేలు చొప్పున చెల్లించాలని చెప్పారు. అంతేకాకుండా ఒక్కసారిగా యాప్ లావాదేవీలను నిలిపివేశారు. దీంతో ఎవరిని సంప్రదించాలో తెలియక మంగళవారం దాసన్నపేట వద్ద ఉన్న కార్యాలయానికి పలువురు చేరుకున్నారు. తాళాలు వేసి ఉండడంతో లబోదిబోమన్నారు. సమాధానం చెప్పేవారు లేకపోవడంతో ఎవరికి చెప్పాలో తెలియక దుఃఖాన్ని దిగమింగు కుంటున్నారు.

మద్యం ఇక నుంచి ఏరులై పారనుంది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఉన్న మద్యం విధానాన్నే నేడు అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ప్రైవేటు షాపుల ద్వారా మద్యం విక్రయాల అమలు, ఆచరణలో లోపాలు, భారాల మాట అటుంచితే గతంతో పోలిస్తే నూతన మద్యం పాలసీ ప్రకారం ధరలు తగ్గుతాయని అంతా భావిస్తున్నారు. గత ఐదేళ్లగా వ్యాపారానికి దూరంగావున్న వారు ఈసారి విక్రయాలకు పోటీపడే అవకాశాలు ఉన్నాయి. ఇదే సందర్భంగా గడిచిన ఐదేళ్లపాటు ప్రభుత్వ నిర్వహణలో సాగుతున్న మద్యం దుకాణాల్లో పనిచేసిన సిబ్బంది ఉపాధి కోల్పోనున్నారు. నాణ్యమైన మద్యాన్ని తగ్గింపు ధరలకు అందుబాటులోకి తెస్తామంటూ ప్రభుత్వం ఆశచూపింది. ప్రస్తుతమున్న ప్రభుత్వ మద్యం దుకాణాల కంటే వాటి సంఖ్య పెరగ నుండడదంతో మద్యం ఏరులై పారనుంది.



ఏరులై పారనున్న మద్యం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

- ప్రయివేటు షాపుల ద్వారా లిక్కర్ విక్రయాలు
- పెరగనున్న దుకాణాలు
- 2శాతం మార్జిన్ పెంపు
- పాత బ్రాండ్లకు పెద్దపీట
- అక్టోబర్ నుంచి అమలు

సర్కారుకు ఆదాయం సమకూర్చే వనరుల్లో ఎక్సైజ్ శాఖ అత్యంత కీలకంగా మారింది. ఈ శాఖ ద్వారా ఏటా సర్కారు వేలకోట్ల ఆదాయం వస్తుందనడంలో సందేహం లేదు. ఈ శాఖ ఆధ్వర్యాన కొన్ని దశాబ్దాలగా మద్యం విక్రయాలు ప్రైవేటు వ్యాపారుల ద్వారా నడిచేవి. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగంలో మద్యం షాపులు పెట్టి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఏళ్లనాటి బ్రాండ్లు కూడా కనుమరుగయ్యాయి. మందుబాబులకు సైతం ఏమాత్రం పరిచయం లేని కొత్త కొత్త బ్రాండ్లు రోజుకొకటి తెరపైకి వచ్చాయి. అవన్నీ నాశిరకం కావడం వల్ల మద్యం ప్రియులు అనారోగ్యం పాలవుతున్నారంటూ నాడు ప్రతిపక్షంలోవున్న టిడిపి, జనసేన పార్టీలు విస్తృతంగా ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే మద్యం ధరలు తగ్గించడంతోపాటు నాణ్యమైన సరుకు అందుబాటులోకి తెస్తామని కూడా హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన దాదాపు 100రోజులకు నూతన మద్యం పాలసీని బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఖరారు చేసింది. ప్రస్తుతం జిల్లాలో 53 మద్యం దుకాణాలు, 8 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఈ పాలసీ ప్రకారం మరో 15 నుంచి 20 దుకాణాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇక నుంచి ప్రభుత్వ ఆధ్వర్యాన కాకుండా, ప్రైవేటు పద్ధతిలో నడపనున్నారు. జిల్లాలోని దుకాణాల్లో 10శాతం గీత కార్మిక కుటుంబాలవారికి రిజర్వు కానున్నాయి. మొత్తం దుకాణాలన్నీ లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు. లాటరీలో పాల్గొనేందుకు రూ.2లక్షలు డిపాజిట్ చెల్లించాల్సివుంటుంది. లాటరీలో షాపులను దక్కించుకున్న వారు సంబంధిత దుకాణం పరిధిలోని జనాభాను బట్టి రూ.50లక్షల నుంచి 80లక్షల వరకు లైసెన్సు ఫీజు చెల్లించాల్సి వుంటుంది. గతంలో ఈ ఫీజు 45లక్షల మాత్రమే ఉండేది. గతంలో 18శాతం మార్జిన్ ఉండగా కొత్త విధానం అమల్లోకి వచ్చాక మద్యం వ్యాపారులకు 20శాతం ఉంటుందని మంత్రి ప్రకటించారు. గతంలో అత్యంత తక్కువ ధర రూ.120కు లభ్యమయ్యే 180మిల్లీ లీటర్ల మద్యం ఇక నుంచి రూ.99కే అందుబాటులోకి రానుంది. 2019నాటికి ముందున్న బ్రాండ్లన్నీ అందుబాటులోకి రానున్నాయి. పాత విధానంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడపడం వల్ల ప్రతి దుకాణంలోనూ ముగ్గురు సిబ్బందిని నియమించారు. ఇందుకోసం మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులు లేఖలు, ఇవి చాలవన్నట్టు చేతులు తడపడాలు వంటివి జరిగాయి. ఇందుకోసం ఆయా ఉద్యోగులు రూ.లక్షలు ముడుపులు చెల్లించారు. వీరంతా తాజా విధానంతో ఉపాధి అవకాశం కోల్పోనున్నారు.

జిల్లాలో ఇ-పంట నమోదుకు ఇంకా ఐదు రోజులే గడువు మిగిలి ఉంది. నాలుగు సబ్ డివిజన్లలో 32,009 ఎకరాల్లో ఇ-పంట నమోదు కావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అందించే రాయితీలు, పంట నష్టపరిహారం, రైతు భరోసా వంటి ప్రయోజనాలు పొందాలంటే ఇ-పంట నమోదు, ఇ-కెవైసి చేయించుకోవాల్సి ఉంటుంది. ఖరీఫ్ సీజన్లో పండించిన పంటలు విక్రయించడానికి కూడా రైతులు ఇ-పంట నమోదు, ఇ-కెవైసి చేయించుకోవాలి. ఈ నెల 23లోగా రైతులు ఈ రెండు ప్రక్రియలు చేయించుకోకపోతే సమీప భవిష్యత్తులో వరి, మొక్కజొన్న పంటలు విక్రయించే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది.

ఇ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

5 రోజులే గడువు

ప్రజాశక్తి-పార్వతీపురం

- ఇ-పంటలో ముందడుగు
- ఇకెవైసిలో వెనుకంజ
- ఇదీ మన్యం జిల్లాలో పరిస్థితి

పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయిలో గత కొద్దిరోజులుగా ఇ-పంట, ఇ-కెవైసి నమోదు ప్రక్రియ యుద్ధప్రాతిపదికన సాగుతోంది. వ్యవసాయ సహాయకులు, విఆర్‌ఒలు ఉమ్మడిగా ఇ-కెవైసి నమోదు చేస్తున్నారు. ఇ-పంట నమోదు మాత్రం వ్యవసాయ శాఖ సిబ్బంది చేస్తున్నారు. ఈ నెల 23 నాటికి ఇ-పంట నమోదు పూర్తి చేసి, 25 నుంచి 27 వరకు గ్రామాల్లో జాబితాలను ప్రకటిస్తారు. ఈ నెల 28, 29 తేదీల్లో సామాజిక తనిఖీ, అభ్యంతరాల స్వీకరణ చేపడతారు. ఈ నెలాఖరున తుది జాబితా విడుదల చేయనున్నారు.

ఇ-పంట నమోదులో సాలూరు సబ్ డివిజన్ 95.35 శాతంతో ముందంజలో ఉంది. ఇ-కెవైసిలో 59.43 శాతం నమోదైంది. పార్వతీపురం సబ్‌డివిజన్‌లో 91.03 శాతం ఇ-పంట నమోదు కాగా, ఇ-కెవైసి 63.85 శాతం జరిగింది. కురుపాం సబ్ డివిజన్‌లో 89.56 శాతం ఇ-పంట నమోదు కాగా ఇ-కెవైసి 68.58 శాతం పూర్తయింది. పాలకొండ సబ్ డివిజన్‌లో ఇ-పంట నమోదు 84.56 శాతం పూర్తికాగా, ఇ-కెవైసి 54.22 శాతం మాత్రమే చేపట్టారు. జిల్లాలో ఇ-పంట నమోదు 89.62 శాతం పూర్తయింది. ఇ-కెవైసి 61.80 శాతం మాత్రమే చేపట్టారు. జిల్లాలో ఇంకా 32,009 ఎకరాలలో ఇ-పంట నమోదు కావాల్సి ఉంది. ఐదు రోజులు మాత్రమే గడువు ఉండటంతో నమోదు ప్రక్రియను అధికారులు వేగవంతం చేస్తున్నారు.

గడువులోగా నమోదు చేసుకోవాలి

ఈ నెల 23లోగా రైతులు ఇ-పంట నమోదు చేసుకోవాలి. ప్రభుత్వ పరంగా అందించే రాయితీలు, పంట నష్టపరిహారం, అమ్మకాలు వంటి ప్రయోజనాలు పొందాలంటే ఇ-పంట నమోదు కావాల్సి ఉంది. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా చేయించుకోవడానికి రైతులు ముందుకు రావాలి.

- రాబర్ట్ పాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

అంగన్వాడీలకు రూ.2.55 కోట్లు

ప్రజాశక్తి-పార్వతీపురం

తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటు : కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల్లో మంచినీరు, టాయిలెట్ల ఏర్పాటుకు రూ.2.55 కోట్లు నిధులు మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించిన లక్ష్యాలపై సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల, విద్య, స్కిల్‌డెవలప్‌మెంటు, మున్సిపల్, మెప్మా, టిడ్కో, ఇంజినీరింగు, ఉపాధిహామీ, సెర్ప్, హ్యాండ్లూమ్, వెల్ఫేర్ డిపార్టుమెంట్లు, ఐసిడిఎస్, వైద్యశాఖలకు నిర్దేశించిన, చేరుకున్న లక్ష్యాలపై సమీక్షించారు.

ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 469 అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు నిర్మించుటకు ఒక్కొక్క సెంటరుకు రూ.36 వేలు చొప్పున రూ.1.68 కోట్లు, 512 సెంటర్లలో మంచినీటి సదుపాయం కోసం ఒక్కో సెంటరుకు రూ.17 వేలు చొప్పున రూ.87.04 లక్షలు... మొత్తం 981 పనులకు గాను రూ.2.55 కోట్ల నిధులను మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టరుతో మాట్లాడి విడుదల చేయించినట్లు తెలిపారు. పనులను చేపట్టుటకు గాను నిధులను జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగు విభాగానికి అందజేశామన్నారు. పనులను వెంటనే మొదలుపెట్టి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

సమావేశంలో వివిధ శాఖల అధికారులు వారికి నిర్దేశించిన లక్ష్యం, సాధించిన లక్ష్యాలను కలెక్టర్‌కు వివరించారు. పురపాలక శాఖకు సంబంధించి పార్వతీపురం అన్న క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధంగా ఉందని, పాలకొండలో అన్న క్యాంటీన్ పనులు పూర్తికానున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. 80.28 కిలోమీటర్ల మేర కాలువల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు వివరించారు. టిడ్కోకు సంబంధించి పార్వతీపురంలో 768 ఇళ్ల నిర్మాణం పూర్తిచేశారని, తాగునీరు, అంతర్గతరోడ్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ సదుపాయం కల్పించాల్సి ఉందన్నారు. సాలూరులో 192 ఇళ్ల నిర్మాణ పనులు పునప్రారంభించాల్సి ఉందని తెలిపారు. గ్రామ పంచాయతీకి సంబంధించి జిల్లాలో 138 చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు గాను 26 పనిచేస్తున్నాయని, అక్టోబరు రెండో తేది నుండి నూరుశాతం పనిచేయనున్నట్లు అధికారులు తెలిపారు. చేనేత, జౌళి శాఖ అధికారులు కనీస లక్ష్యాలను పూర్తిచేయక పోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు.

సమావేశంలో డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, సిపిఒ వీర్రాజు, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా విద్యా శాఖ అధికారి జి.పగడాలమ్మ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎం.ఎన్.రాణి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్. శివ ప్రసాద్, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పోస్టల్ సిబ్బందిపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పోస్టల్ సిబ్బందిపై అధికారులు లక్ష్యాల పేరిట చేస్తున్న వేధింపులు వెంటనే ఆపాలని పార్వతీపురం డివిజనల్ పోస్టల్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించి, నిరసన తెలిపారు. అనంతరం సమస్యల పరిష్కారం కోరుతూ పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబూరావుకు వినతి అందించారు. పోస్టల్ ఉద్యోగులు, జిడిఎస్, పోస్ట్‌మేన్ అండ్ ఎంటిఎస్ ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ రోజుకో రకం లక్ష్యాలు నిర్దేశిస్తూ వాటిని చేరుకోవాలని ఉద్యోగులను, సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే వాటిని ఆపివేయాలని కోరారు. ఈ విషయం పైఅధికారులకు తెలియజేసినా వారు మొండిగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై దశల వారీగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. అక్టోబర్ మూడో తేదీ నుండి ఐదో తేదీ వరకు నల్లబ్యాడ్జీల ధరింపు, 7, 8 తేదీల్లో లక్ష్యాలను బహిష్కరించడం, 9న ఎపి సర్కిల్ మొత్తం ధర్నా చేపడుతున్నట్లు వివరించారు. ఎఐజిడిఎస్ డివిజనల్ కార్యదర్శి ఎం.అప్పారావు, బ్రాంచ్ కార్యదర్శి ఆర్.హేమలత, పి.వేణుగోపాలరావు, ఎం.స్వామినాయుడు, ఎం.మల్లేష్, పాపారావు నాయుడు, ఎపిఐఇయు, పోస్ట్‌మేన్ ఎంటిఎస్ కార్యదర్శి బి.ఉమాశంకర్‌రావు, జె.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

రీసర్వే పరిశీలన

రీసర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని అంటిపేట పంచాయతీ పరిధిలో వెన్నెల బుచ్చింపేటలో డి-పట్టా భూముల రీ సర్వేను సబ్ కలెక్టర్ అశుతోష్ పరిశీలించారు. ముందుగా ఆయన ఫ్రీహోల్డ్ ల్యాండ్‌కు సంబంధించి రికార్డులను, క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతూ ఫ్రీహోల్డ్ ల్యాండ్ రీ సర్వేలో భాగంగా రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన కూడా సిబ్బంది చేయాలన్నారు.

భూ సమస్యలు ఏమైనా ఉంటే తక్షణమే రైతులు రెవెన్యూ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.రాములమ్మ, డిటి శ్రీనివాసరావు, ఆర్‌ఐ ఎన్.శ్రీనివాసరావు, సర్వేయర్ సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కొమరాడ

రోడ్లను బాగుచేయాలని ఈ నెల 20న కొమరాడ మండల కేంద్రంలో చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఎపి డ్రైవర్ మహాసంఘ్ అధ్యక్షులు డి.కుమార్ రాజ్ కోరారు. బంద్‌ను జయప్రదం చేయాలని బుధవారం గుమడ గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న పెద్ద గొయ్యి వద్ద నిరసన తెలిపారు. అనంతరం విలేకరులతో వారు మాట్లాడారు. గత మూడున్నర సంవత్సరాల కాలంగా రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. అటు పాలకులు, ఇటు రోడ్ల భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని చెప్పారు. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే రోడ్లు బాగుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డ్రైవర్ మహా సంఘ్ ఉపాధ్యక్షులు ఆదాడ అప్పారావు, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న ఎయిర్‌పోర్టు

ఎయిర్‌పోర్టుకు అల్లూరి పేరు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

భోగా పురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని మంత్రివర్గం తీర్మానం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం సమావేశమైన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 2200 ఎకరాల్లో తొలి విడతలో భాగంగా రూ.4502 కోట్లతో విమానాశ్రయ పనులు జరుగుతున్నాయి. 2026 నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా జిఎంఆర్ సంస్థ పనులను ముమ్మరంగా చేపడుతోంది. ఇప్పటివరకు 41శాతం పనులు పూర్తయ్యాయి.

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశాలకు ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన సీట్లకు నాలుగో విడత కౌన్సిలింగ్ ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న వారు 27వ తేదీలోగా ఏదైనా ఐటిఐలో వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ యశ్వంత్‌రెడ్డి

నేటి నుంచి అందుబాటులోకి ఇసుక

ప్రజాశక్తి -భామిని

కాట్రగడలో ఇసుక ర్యాంపు గురువారం నుంచి అందుబాటులోకి వస్తుందని పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్ రెడ్డి తెలిపారు. ఇసుక ర్యాంపు నిర్వహణపై రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఇసుక లోడింగ్, డంపింగ్, ట్రాన్స్‌పోర్టు నిర్వహణ పక్కాగా చేయాలని సూచించారు. ఇసుక అక్రమంగా తరలించడానికి అవకాశం లేకుండా చూడాలన్నారు. రిజిస్టర్డ్ వాహనాలు మాత్రమే ఇసుక తరలింపుకు అనుమతించాలని తెలిపారు. నిర్దేశించిన పోర్టల్‌లో ప్రతీ సచివాలయంలో ఇసుక బుక్ చేసుకోవచ్చని తెలిపారు. నేరడి వద్ద అక్రమంగా డంపింగ్ చేసిన ఇసుక సీజ్ చేశామని, ప్రభుత్వ నిబంధనలు మేరకు ఆ ఇసుక తరలిస్తామని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ శేఖరం, ఆర్ఐ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు పాల్గొన్నారు.

రైతుల ఇ-కెవైసి సేకరిస్తున్న విఎఎ

ఇ-పంట నమోదు

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని రంగాపురం గ్రామంలో బుధవారం ఇ-పంట, రైతుల ఇ-కెవైసి నమోదు కార్యక్రమాన్ని ఎఒ శ్రావణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బలిజపేట మండలంలో వరి పంట 16,004 ఎకరాలు, మొక్కజొన్న 688 ఎకరాలు, జీడి మామిడి 130 ఎకరాలు, ఆయిల్ పామ్ 583 ఎకరాలు, మామిడి 407 ఎకరాలు, అరటి 78.81 ఎకరాల ఇ-పంటలో నమోదు చేసినట్లు తెలిపారు. 8122 రైతులు 18,249 ఎకరాల్లో సాగుచేస్తున్నారని తెలిపారు. ఈ నెల 23లోగా ఇ- పంట నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో విఎఎ మోహన్ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంఇఒలు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావు ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంతోపాటు కంబరవలస , తలవరం, నీలానగరం, బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి కొంతమేర సమయం కేటాయించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, రుచికరమైన భోజన అందించాలని సూచించారు. బడితోట కార్యక్రమం పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు వై.లక్ష్మి, సిహెచ్ రత్నాకర్, జి.రవి ప్రసాద్, బి సుంభోర, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు బుధవారం సందర్శించారు. ఫిజికల్ సైన్స్ కాంప్లెక్స్‌ను నిర్వహించారు. కఠినమైన అంశాల్లో కూడా బృంద చర్చలు నిర్వహించి, విద్యార్థులకు అర్థమయ్యేటట్లు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈఏడాది పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఇఒ సూర్య చంద్రమౌళి, ప్రధానోపాధ్యాయులు టి.చంద్రరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలను పూడుస్తున్న పోలీసులు

గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో ఉల్లిభద్ర వద్ద రోడ్డుపై గుంతలను బుధవారం ఎస్ఐ రమేష్‌నాయుడు ఆధ్వర్యాన పూడ్చివేశారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువకు సమీపంలో రోడ్డుమీద ఉన్న గుంతల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గుంతల్లో కంకర వేసి, పూడ్చారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు జనసేన సాయం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

విజయవాడ వరద బాధితులకు జనసేన మండల నాయకులు రూ.25 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని బుధవారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కద్రక మల్లేష్ ఆధ్వర్యాన అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులను ఎమ్మెల్యే అభినందించారు.

ఎమ్మెల్యేకు విరాళం అందిస్తున్న జనసేన నాయకులు

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని వలసబల్లేరు పంచాయతీ వలసగూడ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు నాటు సారా అమ్ముతుండగా అరెస్టు చేసినట్లు నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు తెలిపారు. గ్రామంలో సారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

బొబ్బిలి : స్థానిక ఆసుపత్రి రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ను గురువారం సాయంత్రం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన ఒక ప్రకటనలో తెలిపారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను పున:ప్రారంభిస్తామని ఎన్నికల్లో టిడిపి కూటమి ఇచ్చిన హామీ ప్రకారం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం నుంచి అన్న క్యాంటీన్ ప్రారంభించి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనాలు పెట్టనున్నట్లు తెలిపారు.

పరిహారం కోసం ఎదురుచూపులు

కిమ్మిలో గజరాజులు ధ్వంసం చేసిన మోటార్ పైపులు

హామీలకు పరిమితమైన పాలకులు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని నడుకూరు, కిమ్మి, చిట్టిపూడివలస గ్రామాల్లో గతేడాది ఫిబ్రవరిలో గజరాజుల గుంపు సంచరించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో మొక్కజొన్న, చెరకు, నిల్వ ఉంచిన ధాన్యం, డ్రిప్ ఇరిగేషన్ మోటార్ పరికరాలను ధ్వంసం చేశాయి. రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. పంట నష్టం జరిగి దాదాపుగా ఏడాదిన్నర కాలం గడిచినా ఇంతవరకు పరిహారం మాత్రం బాధిత రైతులకు అందలేదు. పంట నష్టాలను చూసేందుకు వచ్చిన అప్పటి ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్.. పరిహారం అందించడంతోపాటు ఈ ప్రాంతం నుండి గజరాజుల గుంపును తరలిస్తామని హామీ ఇచ్చారు.

పాలకుల ఆదేశాలతో అధికారులంతా త్వరితగతిన పంట నష్టం పరిశీలించి, సమావేశాలు నిర్వహించి ఆగమేఘాల మీద నివేదికలు ప్రభుత్వానికి అందజేశారు. కానీ నేటికీ పరిహారం మాత్రం అందలేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

చిట్టిపూడివలసలో గజరాజులు ధ్వంసం చేసిన ధాన్యం బస్తాలు

రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయాలి

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేలా వ్యవసాయ అనుబంధ శాఖలు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ప్రాథమిక రంగాలైన వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధక, ఉద్యానవన, ప్రకృతి వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి శాఖా లక్ష్యాలు నిర్దేశించుకొని, వాటిని పూర్తిచేయాలని తెలిపారు. జిల్లాలో రసాయన ఎరువులు వాడకం తగ్గించాలని, భూసార కార్డులు రైతులకు అందించి భూమికి తగిన మోతాదులో మాత్రమే ఎరువులు వాడేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాలపై ప్రచారం చేయాలని, తక్కువ పెట్టుబడితో దిగుబడులు సాధించేలా రైతులకు శిక్షణ, సలహాలు అందించాలని తెలిపారు. ఇ-క్రాప్ నమోదు నూరుశాతం పూర్తిచేయాలని తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను గ్రామసభలు నిర్వహించి తీసుకోవాలని తెలిపారు. చిరుధాన్యాలు, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని తెలిపారు. సిసిఆర్‌సి కార్డుదారులకు 5 కోట్ల రూపాయలు రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు జిల్లా కలెక్టరు తెలిపారు.

ఆ మేరకు రుణాలు అందించుటకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఐదు వేల మెట్రిక్ టన్నులు మత్స్య సంపద దిగుబడిని లక్ష్యంగా పనిచేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. నూతన సాగు పద్ధతులు ఆవిష్కరించాలని, కేజ్ కల్చరు ద్వారా సాగును ప్రోత్సహించాలని తెలిపారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి పాలదిగుబడిని పెంచాలని, పశు సంపద వృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

లాభదాయక వ్యవసాయం చేయాలి

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు రూరల్

రైతులు మూస పద్ధతిలో కాకుండా లాభదాయక వ్యవసాయం చేయాలని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర సూచించారు. ప్రతి పంటలో అంతర్ పంటలు వేసుకుని లాభం పొందాలని తెలిపారు. మండలంలోని మామిడిపల్లిలో సువ్వాడ గణేష్ వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. పామాయిల్ తోటలో అంతర పంటలుగా కొబ్బరి, టమోటా, బొప్పాయి, బంతి వంటి మిశ్రమ పంటలు వేయడం వల్ల రైతులు లాభం పొందుతారని తెలిపారు. ఈ సందర్భంగా రైతు సువ్వాడ గణేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, పట్టణ నాయకులు మద్దిల గోవింద్ పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్న దొర

సేంద్రియ సాగుతో రైతులకు మేలు

పాచిపెంట.. జిల్లేడు కషాయం తయారు చేయిస్తున్న ఎఒ తిరుపతిరావు

ప్రజాశక్తి - కురుపాం

సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు సాగు చేయడం వల్ల రైతులకు అధిక దిగుబడులు వస్తాయని ఉద్యాన శాఖ అధికారి గిరిజ అన్నారు. బుధవారం మండలంలో బియ్యాలవలస పంచాయతీ దురుబిలి గ్రామంలో ఎస్ సొసైటీ, మన్యం ప్రగతి రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో హైబ్రిడ్ కూరగాయల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తీగ పద్ధతిలో కూరగాయలు పండించడం ద్వారా రైతులు తక్కువ శ్రమకు ఎక్కువ ఆదాయం పొందుతారని తెలిపారు. ఉద్యాన, వ్యవసాయ శాఖల ద్వారా అమలవుతున్న పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం 5 రకాల విత్తనాలను దురిబిలి, నేరేడువలస, సూర్య నగర్, తెన్నూఖర్జ గ్రామాల రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌కె గౌస్, వ్యవసాయ అధికారి కె.నాగేశ్వరరావు, సర్పంచ్ పి.అజారి, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన

పాచిపెంట : మండలంలోని కోస్టువలస గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఎఒ కె.తిరుపతిరావు అవగాహన కల్పించారు. బీజామృతం, జీవామృతం ఉపయోగాలను వివరించారు. జిల్లేడు కషాయం తయారీని చూపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వినోద్ కుమార్, ఐసిఆర్‌పి విజయ్, తదితరులు పాల్గొన్నారు

చెకుముకి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-వీరఘట్టం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సంబరాల పోస్టర్‌ను బుధవారం కంబరవలస స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ వై.లక్ష్మి, జెవివి జిల్లా అధ్యక్షులు కొండపల్లి గౌరునాయుడు, జిల్లా నాయకులు అన్ను వెంకట్రావు, స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి బి.అప్పలనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరునాయుడు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఈ నెల 25న, మండల స్థాయి అక్టోబర్ ఒకటో తేదీన, జిల్లాస్థాయి 27న, రాష్ట్ర స్థాయి నవంబర్ 9, 10 తేదీలలో ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8, 9, 10వ తరగతిలో చదివే విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులన్నారు. ఆయా విద్యార్థులు పరీక్ష రాసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఆయన కోరారు.

చెకుముకి సంబరాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ వై.లక్ష్మి, జెవివి నాయకులు

ఫ్యాన్లు, లైట్లు వితరణ

ప్రజాశక్తి-పార్వతీపురం

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర పార్వతీపురం బ్రాంచ్ సిఎస్ఆర్ కార్యక్రమంలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ప్రీమెట్రిక్ బాలికల వసతిగృహానికి రూ.17,800 వ్యయంతో 10 ఫ్యాన్లు, 20 ట్యూబ్ లైట్లు అందజేసింది. జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ మాట్లాడుతూ సిఎస్ఆర్ నిధుల ద్వారా ఫ్యాన్లు, లైట్లు అందజేసిన మహారాష్ట్ర బ్యాంకుకు, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ జెవిఎల్ఎన్ మూర్తి, అసోసియేట్ లీడ్ బ్యాంకు అధికారి కె.మౌనిక, మహారాష్ట్ర బ్యాంకు మేనేజర్ ఎ.గణేష్, అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ వెంకటరావు, క్యాషియర్ అనిల్ నాయక్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి పి.రాణి, వసతిగృహ సంక్షేమ అధికారి కురుమమ్మ పాల్గొన్నారు.

భూముల కోసం న్యాయపోరాటం

ప్రజాశక్తి-సాలూరు రూరల్

భూముల కోసం న్యాయ పోరాటం సాగిస్తామని మరిపల్లి ఎంపిటిసి జన్ని సీతారాం తెలిపారు. బుధవారం మరుపల్లిలో వైసిపి నాయకులతో కలిసి సీతారాం విలేకరులతో మాట్లాడారు. వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన సంఘటనతో తమ భూముల వివాదానికి సంబంధం లేదని తెలిపారు. ఆ భూములను మరిపల్లి గ్రామానికి చెందిన వారికి కేవలం తనఖా రిజిస్ట్రేషన్ చేశామని, కానీ వాటిని కరోనా సమయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. దౌర్జన్యం చేసే ఉద్దేశం తమకు లేదని, అలాగైతే వైసిపి అధికారంలో ఉన్నప్పుడే ఆ భూములను దున్నే వాళ్లమని చెప్పారు. ఉద్దేశ పూర్వకంగా ఎవరి మీదా తప్పుడు కేసులు పెట్టబోమని తెలిపారు. తమను కొట్టడంతోనే కేసు పెట్టాం తప్ప అందులో ఎలాంటి స్వార్థమూ లేదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో వైసిపి ఎస్‌టి జిల్లా నాయకురాలు జన్ని భారతి, కాగాన పోలినాయుడు, రాంబాబు, రజనీ, సత్యం పాల్గొన్నారు.

రాజన్నదొర అనుభవం ఇదేనా? : టిడిపి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

నాలుగు సార్లు ఎమ్మెల్యే అయ్యానని, చాలా అనుభవం ఉందని మాజీమంత్రి రాజన్నదొర చెప్పడం చాలా బాగుందని, కానీ ఎవరో చెప్పిన మాటలు విని మాట్లాడడం సబబుగా లేదని టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు అన్నారు. బుధవారం పట్టణంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. తనకు పనులు ఇచ్చినట్లు రాజన్నదొర చెప్పిన మాటల్లో నిజం లేదన్నారు. గ్రామదేవత పండగ ఎన్నో ఏళ్లుగా నిర్వహించడం లేదని చెప్పారు. పట్టణ ప్రజల కోరిక మేరకు మంత్రి సంధ్యారాణి.. పట్టణ పెద్దలను, ధర్మకర్తలను కలుపుకుని వెళ్లారని గుర్తుచేశారు.

టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్ మాట్లాడుతూ అన్ని సామాజిక తరగతులు కలిసిమెలిసి ప్రశాంతంగా ఉన్నాయని, అటువంటి వాతావరణాన్ని కలుషితం చేయవద్దని కోరారు. మరుపల్లిలో వినాయక నిమజ్జనంలో జరిగిన చిన్న గొడవను పెద్దదిగా చేసి, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి నాయకులు మరిపి సింహాచలం, కరిబుగత భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

రూ 21.50 లక్షలతో అభివృద్ధి పనులు ముమ్మరం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని దబ్బగడ్డ పంచాయతీలో రూ.21.50 లక్షలతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి పనసభద్ర, విజయరాం పురం, దబ్బగడ్డ గ్రామాలలో సిసి రోడ్లు, కాలువల పనులు శరవేగంగా సాగుతున్నాయి. మండల ఇంజినీరింగ్ అధికారి బి.రజిత్ ఆదేశాలతో స్థానిక ఇంజినీరింగ్ అసిస్టెంట్ పి.సంతోష్ కుమార్ పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ సంతోష్ కుమార్ తెలిపారు.

దబ్బగడ్డలో నిర్మిస్తున్న సిసి కాలువ

జనసేనలో చేరుతున్న తిరుపతిరావు

జనసేనలో చేరిన 'పెంట'

ప్రజాశక్తి-మక్కువ

టిడిపి సీనియర్ నాయకులు, ఎ.వెంకన్నపేట సర్పంచ్ పెంట తిరుపతిరావు బుధవారం జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి ఆదాడ మోహన్‌రావు ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి టి.శివశంకర్ సమక్షంలో చేరారు. తిరుపతిరావుతోపాటు ఎ.వెంకంపేట ఎంపిటిసి దొడ్డి సాయిబాబా, మాజీ ఎంపిపి పెంట ఉమా కోన, శంబర, వెంకట బైరిపురం, దేవరశిర్లం పంచాయతీలకు చెందిన పలువురు జనసేనలో చేరారు.

ప్రధానోపాధ్యాయులు శంకరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

ప్రజాశక్తి-సీతానగరం

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లచ్చయపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శంకరరావును బుధవారం ఆర్.వెంకంపేట స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 మువ్వల వెంకటరమణ మాట్లాడుతున్న శంకరరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బి.ప్రసాదరావు, పి.సత్యనారాయణ, ఎ.మోహనరావు సిహెచ్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

సీతానగరం.. కాలువల్లో బ్లీచింగ్ చల్లుతున్న కార్మికులు

ముమ్మరంగా స్వచ్ఛత హి సేవ

ప్రజాశక్తి-పార్వతీపురం

స్వచ్ఛత హి సేవ కార్యక్రమం రెండో రోజు బుధవారం జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా సాగింది. పురపాలక సంఘాల పరిధిలో వార్డుల్లోనూ, గ్రామాల్లో వివిధ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టారు. మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు కార్యక్రమాలను పక్కాగా రూపకల్పన చేశారు. రెండో రోజు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం, తుప్పలను శుభ్రం చేయడం, కాలువల పరిశుభ్రం, బ్లీచింగ్, స్ప్రేయింగ్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టడం, లార్వా నాసిన కార్యక్రమాలు, ఆయిల్ బాల్స్ వివిధ నీటి వనరుల ప్రదేశాల్లో విడుదల చేయడం చేశారు. ప్రజలు కూడా పూర్తిస్థాయిలో ఇందులో భాగస్వామ్యమై గ్రామాల్లో సహకారాన్ని అందజేశారు. వైద్య ఆరోగ్యశాఖ పలు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలను అందించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు దీన్ని పర్యవేక్షణ చేశారు.

వీరఘట్టం.. రోడ్డుపై చెత్త ఏరుతున్న విద్యార్థులు